

# కన్నీరింకని కథలు

## - షర్మిల



## జీవిత ఖైదీ

**పెళ్ళి ఎంతో** ఘనంగా జరిగింది.

అనన్యా, వివేక్  దంపతులయ్యారు. పీటల మీద కూర్చున్న ఆ జంటను ముచ్చటగా చూస్తూ నించుంది పూర్ణ.

"చూసుకున్నది చాల్లేమ్మా! పద. పిల్ల అత్తారింటికి వెళ్ళేటప్పుడు సర్దాల్సిన సంగతి చూడు " అన్న తల్లి మాటలతో అక్కడి నుంచి కదిలింది .

యూఎస్ఎ లో ఎమ్మెస్ చదివి ఉద్యోగం సంపాదించుకుంది అనన్య.

సుధాకర్ కూతురికి సంబంధాలు చూద్దామనుకుంటున్న టైం లోనే చిన్నప్పటి క్లాస్మేట్ సుందర్ ఒక పెళ్ళిలో కనపడ్డాడు.

కూతురికి మంచి సంబంధం చూడమనగానే నవ్వేశాడు.

"నేనూ మా అబ్బాయికి అమ్మాయి కోసం వెతుకుతున్నారా. పెళ్ళి అప్పుడే వద్దని వాడు గొడవ చేస్తే వాళ్ళమ్మ ఏడ్చి రాగాలు పెడితే ఒప్పుకున్నాడులే " అన్నాడు సుందర్.

"మొన్నే ఫుల్ టైం జాబ్ లో చేరాడు  పెళ్ళి చేసేస్తే ఓ పనై పోతుంది కదా. మీ అమ్మాయి బయో డేటా పంపరా మా అబ్బాయిది నేను నీకు ఫార్వర్డ్ చేస్తా"  అన్నాడు .

ఇద్దరి వయసు సరిపోయిందని కాకపోతే అబ్బాయి న్యూజెర్సీ లో వుద్యోగం కాబట్టి  అమ్మాయి అక్కడికి మారాలని చెప్పాడు.

మొత్తానికి అన్నీ చక చకా జరిగిపోయాయి. పెళ్ళయ్యాకా అత్తవారింటికి వెళ్ళి మూడు రోజులుండి పుట్టింటికి భర్తతో సహా వచ్చింది అనన్య.

ఇద్దరూ గదిలో గంటల తరబడి మాట్లాడుకోవడం చూసి " మన పెళ్ళైన కొత్త గుర్తొస్తోంది కదూ " అన్న సుధాకర్ మాటలకి అవునన్నట్టు తలూపింది.

"మావయ్యా నేను రెండు రోజుల్లో వెళ్తున్నా అనన్య లీవ్ కూడా ఇంకో పదిరోజుల్లో అయిపోతుంది ఈలోగా నేను ఇల్లు షిఫ్ట్ అవుతాను. తను డైరెక్ట్ గా అక్కడికే వచ్చేయొచ్చు "అన్నాడు వివేక్.

అనన్య యూఎస్ ప్రయాణమైంది.

రోజూ ఒక గంట మాత్రం తల్లితండ్రులతో ఫోన్ మాట్లాడ్డం ఎమ్మెస్ కి వెళ్ళినప్పటి నుంచి అలవాటే.

అలాగే మాట్లాడుతూనే వున్నా రాను రానూ కూతురి గొంతులో ఉత్సాహం తగ్గడం ఇద్దరూ గమనించారు.

తరచి అడిగినా "ఏంలేదు " బాగున్నానని చెప్పింది.

"వివేక్ ! నీతో మాట్లాడాలి "అంది ఈ రోజు.

"చెప్పు "అన్నాడు.

"మన పెళ్ళయ్ నెల రోజులైంది కనీసం ఒక్క సారి అయినా కలుసుకోలేదు మరి పెళ్ళెందుకు చేసుకున్నావ్? నీ ప్రాబ్లం ఏంటి ? " అనన్య అడిగింది సూటిగా

"పెళ్ళి చేసుకోవడం తప్పని సరైంది, అమ్మా నాన్నా గొడవపడ్డారు ...చివరికి అమ్మ చస్తానని బెదిరించింది అందుకే చేసుకోకతప్పలేదు."

“సరే చేసుకున్నావ్ కదా ఇంకేంటి?” అంది

"సారీ అనన్యా! నాకు అమ్మాయిలంటే ఇంట్రెస్ట్ లేదు, నాకు బాయ్ ఫ్రెండ్ వున్నాడు" అన్నాడు తలొంచుకుని.

దబ్బుమన్న శబ్దంతో పక్కకి చూశాడు. అనన్య కళ్ళు తిరిగి పడిపోయింది.

ఒక్క క్షణం ఆమెకి తన జీవితం ప్రశ్నార్ధకంగా మిగిలినట్టనిపించింది. అంత కఠోర వాస్తవాన్ని తట్టుకోలేక ఒక్క సారిగా కుప్పకూలింది.

"లే ! అనన్యా ...నీళ్ళు తెచ్చి మొహం తుడుస్తున్న వివేక్ ని గట్టిగా కౌగలించుకుంది.

నెమ్మదిగా ఆమెను లేపి మంచం వరకూ నడిపించి పడుకోబెట్టాడు.

"చూడు వివేక్ ఇన్నాళ్ళూ ఓపికపట్టాను. ఇండియాలో నువ్వు ఇద్దరం ఫ్రెండ్స్ లా కొన్నాళ్ళు వుందామన్నావ్. అదీ ఓకే అనుకున్నా. ఇప్పుడు అసలు నిజం బయటపెట్టావ్. నీ జీవితం నీకు నచ్చిన విధంగా గడిపే హక్కు నీకుంది. కానీ నా మాటేంటి? నా నిండు జీవితానికి సంబంధించిన సమస్య ఇది. ఇప్పుడు నా బతుకేంటి?"

" ఏముంది ! కొన్నాళ్ళు పోయాక డైవోర్స్ తీసుకో , నీకు నచ్చిన వాళ్ళని చేసుకో "అన్నాడు.

"అంటే పెళ్ళి నీ దృష్టిలో ఏమీ కాదా? నేను ఎన్నో కలలుగన్న జీవితాన్ని ఛిద్రం చేసే హక్కు నీకు లేదు ప్లీజ్" బతిమాలింది.

ఏమన్నా అతని నుంచి సమాధానం లేదు. ఇంట్లో వాళ్ళకి చెప్పి వాళ్ళ మనశ్శాంతి పోగొట్టడం ఇష్టం లేక అనన్య ఏమీ చెప్పలేదు. ఏడాది గడిచింది. ఎవరికి వాళ్ళు ఉద్యోగాలకి వెళ్ళి వస్తున్నారు. ఏ ముద్దు మురిపాలు లేవు. ఏదో అవసరమైన నాలుగు మాటలు మాట్లాడుకుంటున్నారు.

సాయంత్రం అయ్యే సరికి రెడీ అయ్యి బయటకి వెళ్ళిన వివేక్ ఏ అర్ధ రాత్రో వస్తాడు. ఈ మధ్య ఎక్కువ తాగి వస్తున్నాడు. ఆ రోజు తాగిన మత్తులో అనన్య బెడ్ పై వాలాడు వివేక్ .

ఆరోజే అనన్యకి తొలిరాత్రి అయ్యింది. వివేక్ తో గడిపిన చివరి రాత్రి కూడా అదేనేమో. ఆమె అదృష్టమో దురదృష్టమో నెల తప్పింది.

పురిటి సమయానికి సుధాకర్, పూర్ణ వచ్చారు. ఆడపిల్ల పుట్టింది. అప్పుడే తల్లి తండ్రికి జరిగింది చెప్పింది.

సుధాకర్ కోపంగా వివేక్ ని నిలదీశాడు.

"అంకుల్ మీరు ఈ విషయం నాన్నతో చెప్పొద్దు. మీ అమ్మాయిని డైవోర్స్ తీసుకుని ఇంకో పెళ్ళి చేసుకోమనండి కానీ నా పిల్లని నాకు ఇచ్చేయాలి."

"అదేంటి ? నా బిడ్డని నేనెలా ఇస్తాను "అరిచింది అనన్య.

"నాకు నా కూతురు కావాలి, నేను పెంచుకుంటాను, కోర్ట్ కి వెళ్ళయినా హక్కు తెచ్చుకుంటాను" అని సమాధానంగా అన్న వివేక్ మాటలకి మాట రాలేదు ఎవరికీ.

పుట్టెడు దుఃఖంతో సుధాకర్, పూర్ణ ఇండియా వెళ్ళిపోయారు.

తరవాత తరవాత వివేక్ పూర్తిగా తాగుడుకి బానిసయ్యాడు. ఒక్కనాడూ ఆత్మీయ స్పర్శకు నోచుకోని అనన్య డిప్రెషన్లోకి వెళ్ళిపోయింది.

వివేక్ కి డైవోర్స్ ఇస్తే బిడ్డని వదులుకోవాలి ...ఈ జీవితం ఇంతే అన్న నిస్పృహలో మునిగిపోయింది. డిప్రెషన్ మందులు మింగుతూ ఒక్కో సారి కడుపు పొగిలిపోయేలా ఏడుస్తుంది.

తల గోడకేసి బాదుకుంటుంది. తన జీవితం కోసం చూసుకుంటే బిడ్డని వదులుకోడానికైనా సిద్ధపడాలి. అందుకు అనన్య సిద్ధంగా లేదు.

రాజీపడి జీవచ్ఛవంలా బతకడానికే అనన్య నిశ్చయించుకుంది. చెయ్యని తప్పుకు శిక్ష అనుభవించే జీవితఖైదీలా బతుకీడుస్తోంది.

*(వచ్చేనెల మరో కథ)*